8

# ఆత్మ సంబంధమైన ఇశ్రాయేలు

> "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజకసమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు. ఒకప్పుడు ప్రజగా ఉండక యిప్పుడు దేవుని ప్రజయైతిరి; ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడినవారైతిరి" (1 పేతురు 2:9, 10).

ఇటీవల, హార్డింగ్ యూనివర్సిటీ క్రొత్త నిబంధన సర్వే క్లాసుల్లో "కాలము పరిపూర్ణ మైనప్పుడు" క్రీస్తు ప్రభువు ఈ లోకానికి వచ్చిన సంగతిని గూర్చి మాట్లాడాను. వెంటనే ఒక చెయ్యి పైకి లేచింది, అత్యాసక్తితో, "కాలం సంపూర్ణమవ్వడమంటే ఏంటి?" అని ఒక యువకుడు అడిగాడు. గలతీ. 4:4, 5కు తిప్పి, క్రీస్తు జన్మను గూర్చిన పౌలు మాటలను యిలా చదివాను: "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను."

"కాలము పరిపూర్ణమైనప్పుడు" అంటే, దేవుని నిత్య జ్ఞానంలోను, ముందు ఆలోచనలోను క్రీస్తు లోక రక్షకుడుగా అవతరించడానికి నియమించబడిన కాలాన్ని ఆదర్శ సమయమని నేను వివరించాను. దీన్ని మరో విధంగా చెప్పాలంటే, రక్షకుని జననానికి ముందు దేవునియొక్క ప్లానింగ్ మరియు సిద్ధపాటు అనేవి ఉన్నాయి. మన పరలోకపు తండ్రి మనస్సులో సంక్షిప్తంగా తలంపు పుట్టి, త్వరితంగాను, ఉద్రేక పూర్వకం గాను ఆయన అవతరణ సంభవించలేదు, కాని జగత్తు పునాది వేయబడకమునుపే ఆయన రాక చిక్కినది దేవుని మనస్సులో బ్లూ ప్రింట్ చేయబడింది లేక నమూనా వేయబడింది. అవసరమైన సంఘటనలు సంభవించినప్పుడు, దేవుని జోక్యానికి లోకం సిద్ధమైయున్నప్పుడు లేక పరిపక్వమైయున్నప్పుడు, ప్రభువైన యేసు జన్మించాడు. చరిత్రలో అట్టి పరిస్థితుల కలయికను పౌలు, "కాలము పరిపూర్ణమైనప్పుడు" అని తగినట్టు పిలిచాడు.

పాత నిబంధన కాలమంతయు – పితరులయొక్కయు, మోషేయొక్కయు యుగముల కాలంలో – మెస్సీయ రాకయొక్క ప్రస్తావన రూపొందింది. పితరుల యుగములో దేవుడు అబ్రాహామును, యాకోబును తన సేవకులనుగా ఏర్పరచుకొని వారి ద్వారా తనకు సొత్తయిన జనాంగాన్ని రూపించడానికి కోరుకున్నాడు. ఆ జనాంగాన్ని "ఇశ్రాయేలు" అని పిలవడానికి ఆయన కోరుకున్నాడు. ఆ పేరు ఆయన యాకోబుకు యిచ్చినదే. మోషే యుగంలోనైతే, ఏర్పరచుకొన్న తన జనాంగాన్ని ధర్మశాస్త్రం క్రిందికి తెచ్చి, సీనాయి కొండవద్ద మోషే ద్వారా దానిని బయలుపరచాడు. తన్ను ఆరాధిస్తూ పరిశుద్ధమైన తన

జనంగా ఉండాలని ఆయన వారికి బోధించాడు. అయినను, పాత నిబంధన కాలంలో జరిగిన దేవుని చర్యలన్నియు "కాలము సంపూర్ణమైనప్పుడు" మెస్సీయాను లోకమునకు తెచ్చుటకు నిజంగా సిద్ధపాటుగాను ముందు ఏర్పాట్లుగాను ఉన్నాయి. "పాత నిబంధన కథ ఒక జనాంగం యొక్క కథయు, క్రొత్త నిబంధన కథ ఒక వ్యక్తియొక్క కథయై ఉన్నది" అని ఒక వ్యక్తి అన్నాడు.

పాత నిబంధన కథ ఇశ్రాయేలు జనాంగము యొక్క కథయై ఉన్నందున, మెస్సీయాను లోకంలోనికి తెచ్చుటలో ఈ జనాంగాన్ని సృజించడం దేవునియొక్క ముందటి పనియై యున్నందునను, ప్రభువు సంఘాన్ని పౌలు దేవుని ఇశ్రాయేలు అని సూచించడంలో మనం ఆశ్చర్యపోనవసరం లేదు: "ఈ పద్ధతిచొప్పున నడుచుకొను వారికందరికి, అనగా దేవుని ఇశ్రాయేలునకు సమాధానము కృపయు కలుగును గాక" (గలతీ. 6:16). దేవునితో ప్రాచీన ఇశ్రాయేలుకు ఉండే నిబంధన సంబంధమైన పదజాలంనుండి పౌలు సంఘాన్ని చిత్రించడంతో కూడా మనం ఆశ్చర్యపడనవసరం లేదు: "ఎందుకనగా శరీరమును ఆస్పదము చేసికొనక దేవునియొక్క ఆత్మవలన ఆరాధించుచు, క్రీస్తుయేసునందు అతిశయపడుచున్న మనమే సున్నతి ఆచరించువారము" (ఫిలిప్పీ. 3:3). సంఘాన్ని "ఇశ్రాయేలుగా" చిత్రించడం మనకు ఎంతో ప్రాముఖ్యంగా ఉండాలి, ఎందుకంటే క్రైస్తవులు నేడు ఆత్మసంబంధమైన ఇశ్రాయేలనియు, ప్రాచీన ఇశ్రాయేలువలెనే దేవుని సొత్తుగా వారు ప్రత్యేకింపబడ్డారనియు అది మనకు తెలుపుతోంది!

క్రొత్త నిబంధనలో, క్రొత్త నిబంధన సంఘం ఇశ్రాయేలని సంక్షిప్తంగా స్థిరపరచేది 1 పేతురు 2:9, 10 అయ్యుండవచ్చు. 1 పేతురు 1:22–2:10లో, క్రైస్తవుడంటే అర్థమేమో పేతురు వివరించుతూ, క్రైస్తవుని మార్పు (1:22–25), ప్రవర్తన (2:2, 3), మరియు పిలుపు (2:4–10) అనేవాటిని అతడు సూచించాడు. క్రైస్తవులు దేవునియొక్క ఏర్పరచబడిన జనము, ఆయన నిజమైన ఇశ్రాయేలు అనే సత్యమందు ఆనందించుడని తన పాఠకులను అడుగుతూ అతడు ముగిస్తున్నాడు.

1 పేతురు 2:9, 10లో, క్రైస్తవులు దేవుని ఇశ్రాయేలనే పేతురుయొక్క సూచనపై దృష్టి నిలుపు. దేవునితో మనకున్న ప్రత్యేకమైన బాంధవ్యాన్ని, దేవునియొద్దనుండి మనం పొందిన ప్రత్యేకమైన పిలుపును ఈ పోలిక స్థిరపరచుతోంది; క్రీస్తునందు మనకు ప్రసాదింపబడిన ఆత్మసంబంధమైన ఆశీర్వాదములయందు ఆనందించడానికి మనకు హేతువునిస్తుంది. మనం ఆత్మసంబంధమైన ఇశ్రాయేలుమని ఈ వచనాలు ఉపదేశిస్తున్నాయి.

## ఏర్పరచబడిన వంశం

సంఘాన్ని ఆత్మసంబంధమైన ఇశ్రాయేలుగా వర్ణించడంలో, మొదటిగా క్రైస్తవులు "ఏర్పరచబడిన వంశమని" పేతురు తెలిపాడు (1 పేతురు 2:9). వారు ఎన్నుకోబడ్డారు, ఏరి కోరి తీసికోబడ్డారు, ప్రత్యేకపరచబడ్డారు. వారు దైవికంగా ఏరి తీసికొనబడిన జనమైయున్నారు, భూ జనులందరిలోనుండి పిలువబడినవారైయున్నారు.

సీనాయి పర్వతము వద్ద మోషే ద్వారా దేవుడు ఇశ్రాయేలుకు తెలియజేసిందేమంటే, "నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనము, నీ దేవుడైన యెహోవా భూమిమీదనున్న సమస్త జనములకంటె నిన్ను ఎక్కువగా ఎంచి, నిన్ను తనకు స్వకీయజనముగా ఏర్పరచుకొనెను" (ద్వితీయో. 7:6). మరియు ఆయన ఇశ్రాయేలుతో యిలా అన్నాడు, "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు" (నిర్గమ. 19:5).

ఏదియెలాగున్నా, మానవ చరిత్రయొక్క కడపటి యుగమందు శరీర సంబంధులగు ఇశ్రాయేలీయులు కాక, క్రైస్తవులే దేవునియొక్క ఏర్పరచబడిన వంశమైయున్నారు. సంఘమను నూతన ఇశ్రాయేలునందు కనుగొనబడే నెరవేర్పుకు ప్రాచీన ఇశ్రాయేలు నడిపించినదై, పునాదిగా రూపొందినదైయుంది. క్రీస్తులోనికి ప్రవేశించువారందరు ఏర్పరచబడిన వంశమగు తన ప్రజలుగా ఉండడం దేవునియొక్క ముందుగా నిర్ణయించుకున్న తీర్మానమైయుందని పౌలు తెలిపాడు:

> తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను, ... దేవుడు తన చిత్తప్రకారమైన సంకల్పమునుబట్టి మనలను ముందుగా నిర్ణయించి, ఆయనయందు స్వాస్థ్యముగా ఏర్పరచెను. ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయముచొప్పున సమస్తకార్యములను జరిగించుచున్నాడు (ఎఫెసీ. 1:4, 5, 11).

విడిచి పెట్టబడిన, మనలను తప్పించిపోయిన, లేక అలక్ష్యం చేయబడినందున నిరాశపడిన అనుభవాలు మనకందరికి ఉంటాయి. ఇతరుల అభ్యర్థులుగా పిలువబడిన, లేక ఏరి తీసికొనబడగా, కడవరకు మనలను ఎవరూ లక్ష్యపెట్టకుండ ఉండడాన్ని మనం చూచే ఉండవచ్చు. ఆటకొరకు జట్టును ఎన్నుకునేటప్పుడు చిన్నపిల్లలప్పుడు మనలో కొందరు ఈ బాధను అనుభవించియుండవచ్చు. మనకు ముందు యితరులను ఏరుకొనడం గాని, లేక సంపూర్ణంగా మనలను వదలివేసి (స్కోరు) లెక్క చూడడానికి గాని నిలబెట్టి యుండవచ్చు. గౌరవింపబడినవారి పేర్లు లిస్టులో చదువబడుతూ ఉండగా, నిలువబడి శ్రద్ధగా ఆలకిస్తుండగా మన పేరు చివరిగా చదవబడడం, అందులోను అది తప్పుగా ఉచ్చరింపబడడంవంటి కార్యాలు జరుగవచ్చు. ఈలాటి సంఘటనలు మనలను క్రుంగదీసి, చాలా కాలంవరకు వెంటాడే జ్ఞాపకాలుగా మిగిలిపోయి, మనం "దేనికి పనికిరాని వారమనే" భావన కలుగవచ్చు. ఈలాటి పరిస్థితులు మనలను మనోవ్యాధి వైద్యునియొద్దకు పోయిన మనిషిలా చేయవచ్చు. "డాక్, అధముడననే భావన నాకుంది, దాన్ని గూర్చి ఏమి చేయాలో తోచడం లేదని" ఒకడు మనోవ్యాధి వైద్యుని యొద్దకు వచ్చాడట. మనోవ్యాధి వైద్యుడు పలుమారులు ఆ రోగిని పరీక్షించినమీదట, "ఓయీ, నీకు అధముడననే భావన లేదు, నీవు అధముడవే"నని వైద్యుడు అన్నాడట!

జనులు అలక్ష్యం చేయబడే పరిస్థితులు ఉత్పన్నమౌడానికి సహజ కారణాలు, ప్రజలయొక్క సామర్థ్యం, ప్రజలు కన్పించే తీరు, ప్రదర్శింపబడే తెలివి, ప్రజలకు కలిగి

యున్న (ఆస్తి) అనేవాటిమీద ఎక్కువ ప్రాధాన్యత నిలపడమే. తత్ఫలితంగా, అది మనకు సంభవించినప్పుడు, అది మనలను పాడు చేసేదిగా ఉంటుంది. ఎందువలనంటే, మనవద్ద కావలసినంత సామర్థ్యం లేదు, అందం లేదు, కావలసినంత తెలివి లేదు, లేక తగినంత ఆస్తి లేదు అనిపిస్తుంది.

---

నేడు మనం దేవుని ఇశ్రాయేలు అనేది బలీయమైన సత్యం.
అది ఎంతటి శక్తివంతమైనదంటే ... నిరీక్షణతోను
అభయంతోను అది మనలను శక్తివంతులనుగా చేస్తుంది.

---

అయితే, పేతురు ప్రకారం, క్రైస్తవులు దేవునిచే ఏర్పరచబడిన వంశమైయున్నారు. మనం సామర్థ్యం గలవారమని, అందగాళ్లమని, తెలివిగలవారమని, లేక మనకు ఎక్కువ ధనముందనో కాదు గాని, మనం దేవునిచే ప్రేమించబడడం – దేవుని చిత్తానికి విశ్వాసం విధేయతలతో స్పందించాం, ఆయన సంఘం, ఆయన పిల్లలమయ్యామనే సత్యం అతడు తెలిపాడు. దేవునితో మనకున్న అంతస్థు కనికరంవలన కలిగిందే గాని, మన ధనంవలన గాని, మన మానవ యోగ్యతవలన కలిగింది గాని కాదు. “ఒకప్పుడు కనికరింపబడక, యిప్పుడు కనికరింపబడినవారైతిరి” అని పేతురన్నాడు (1 పేతురు 2:10). పౌలు తీతుకు యిలా తెలిపాడు, “మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మసంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను” (తీతు 3:5). క్రీస్తులోనికి మన బాప్తిస్మమునందు, మనము దేవునియొక్క కనికరము పొంది, ఏర్పరచబడిన తన వంశంగా చేయబడ్డాం.

నేడు మనం దేవుని ఇశ్రాయేలు అయ్యున్నామనేది బలీయమైన సత్యమైయుంది – అది ఎంత శక్తివంతమైనదంటే, బాధించే పరిస్థితులు మరియు స్నేహపూరితం కాని లోకం సహా మన యొద్దనుండి తొలిగించలేనట్టి నిరీక్షణతోను అభయంతోను అది మనలను శక్తిమంతులనుగా చేస్తుంది. ఉదాహరణకు, దేవునికి ప్రార్థించడంలో ధైర్యమును నమ్మికను అది మనలో కలిగించాలి. ఏ అవసరతలోనైనా ఆయన కృపాసనము వద్దకు మనం ధైర్యంగా సమీపించగలం. లేక ఎప్పుడు ఆయనను స్తుతించి ఘనపరచాలన్నా అలాగే చేయగలం. దేవుని బలమునందు మనం జీవించేలా అది చేయగలదు, ఎందుకంటె దేవుని యొక్క ఏర్పరచబడిన జనులంటేనే, దేవునియొక్క ఆత్మసంబంధమైన ఆశీర్వాదములు మనకు ఎన్నడు మూయబడకుండేలా ఆయన స్టోర్ హౌస్ ఉన్నట్టు గుప్తం చేయబడింది (ఎఫెసీ. 2:18).

ఏర్పరచబడిన ఆయన వంశమైయున్నందుకు మనం ఆనందిస్తాం!

## రాజులైన యాజక సమూహం

రెండవది, సంఘము “రాజులైన యాజక సమూహమని” పేతురన్నాడు

(1 పేతురు 2:9). క్రైస్తవులు నేడు దేవుని యాజకులైయున్నారు. ఏక జనంగా, వారు యాజక రాజ్యమై యున్నారు.

పాత నిబంధన కాలంలో, ఆయన జనం తనను సమీపించడానికి లేవీయ యాజకత్వాన్ని ప్రసాదించాడు. అబ్రాహాము కుటుంబంలోనుండి లేవీయ గోత్రం ద్వారా యాజకులను ఆయన ఎన్నుకున్నాడు ప్రజలయొక్క బలులను ఆయన వారికి అప్పగించాడు. మోషే ధర్మశాస్త్రం నియమించిన విధానాలలో యాజకులు సూచించినట్టు ఇశ్రాయేలీయులు ఆయనను ఆరాధించడానికి నడిపింపబడ్డారు.

దేవుడు లేవీ గోత్రికులకు యిలా తెలియజేశాడు, "... ఇశ్రాయేలీయుల మధ్యను నీ పాలు నీ స్వాస్థ్యము నేనే" (సంఖ్యా. 18:20). ఆరాధనలోను, పరిచర్యలోను, జీవితంలోను దేవుని ప్రత్యేకంగా సేవించే ఘనత లేవీయులకు అప్పగింపబడింది. దేవుని సన్నిధికి చేరే భాగ్యము ఆయనకు సన్నిహితంగా సంబంధం కలిగియుండేది కూడా వారికి అనుగ్రహింపబడింది.

1 పేతురు 2:9లో, లేవీ యాజకత్వం యిక అమలులో లేదని, దేవునిచే వేరొక యాజకత్వం కోరుకోబడిందని పేతురు తెలిపాడు. క్రీస్తు ప్రభువు యొక్క విమోచనా కార్యక్రమంవలన, క్రైస్తవ యుగంలో ఆయన సంఘమే యాజకత్వం చేయడానికి నియమించబడింది.

దేవుడు సంఘాన్ని యాజక సమూహమని పిలవడం మాత్రమే గాక, "రాజులైన" యాజక సమూహమని ఆయన పిలిచాడు. సంఘం యాజకుల రాజ్యం లేక రాజులైన యాజకులు. హింసింపబడుతున్న క్రైస్తవులకు పత్మాసునుండి యోహాను యిలా వ్రాశాడు, "ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగాను జేసెను" (ప్రకటన 1:6). పేతురు కూడా యిలా అన్నాడు, "యేసుక్రీస్తుద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:5). పరిశుద్ధాత్మ సహాయంతో క్రైస్తవుడు నేరుగా దేవుని సముఖానికి వెళ్లవచ్చు (రోమా 8:27) మరియు విజ్ఞాపన చేసే మన ప్రధాన యాజకుడును మధ్యవర్తియునైన యేసు ద్వారా ఈ కార్యం జరుగుతుంది (1 తిమోతి 2:5; హెబ్రీ. 7:26, 27). ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా తప్ప మరెవ్వరి ద్వారా దేవుని సముఖానికి చేరరు. అతడు దేవునియెదుట దేవుని యాజకునిగా నిలిచి మానవునిచే నియమింపబడిన యాజకులు గతించిపోయిన పరిశుద్ధులు, లేక దేవదూతలు అనేవారి సహాయంతో నిమిత్తం లేకుండ యేసుక్రీస్తు ద్వారా విన్నవించుకోవచ్చు.

"Priest" అనే లాటిన్ పదానికి "వంతెన – కట్టువాడు" అని అర్థం. పాత నిబంధన కాలంలో యాజకునియొక్క పాత్ర "వంతెన" అనే భావాన్ని ఉదహరిస్తుంది. దేవునికిని నరునికిని మధ్య యాజకుడు ఒక విధమైన వంతెనయై ఉన్నాడు. అతడు దేవుని చిత్తాన్ని నరులయొద్దకు తెచ్చాడు, మానవ మనవులను దేవునికి సమర్పించాడు. క్రైస్తవ యుగంలో అది ఎంత వ్యత్యాసం! ఒకడు క్రైస్తవుడుగా మారినప్పుడు, అతడు క్రీస్తులోనికి ప్రవేశించే సమయమందే, అతడు దేవుని యాజకుడౌతాడు.

దేవుని యాజకులుగా మన స్థితి దేవుని పనికి మనలను మనం సమర్పించుకునే వారంగాను, ఆయన ప్రసాదించిన ఈ పవిత్రమైన స్థితిని ఆయనతో సహవాసమందు జీవించడానికి గాను మనలను బలవంత పెట్టవలసియుంటుంది. దేవుని యాజక సమూహంగా, దేవునియెదుట మనకు హెచ్చయిన ఆధిక్యత కలిగియుంటాం.

మనం "రాజులైన యాజక సమూహ"మైనందుకు ఆనందించుదాం!

## పరిశుద్ధ జనము

మూడవది, క్రీస్తు సంఘము "పరిశుద్ధ జనమని" పేతురు తెలియజేశాడు (1 పేతురు 2:9). అలంకార రూపంలో మాట్లాడితే, సంఘము దేవుని జాతీయ ప్రజలు, ఆయనకు ప్రత్యేకంగా సమర్పింపబడిన రాజ్యపు జనులు.

ఏర్పరచబడిన దేవుని జనాంగంగా ఇశ్రాయేలు, పరిశుద్ధతకు పిలువబడింది. మోషే ద్వారా, దేవుడు ఇశ్రాయేలుకు యిలా తెలియజేశాడు, "మీరు పరిశుద్ధులై యుండవలెను. మీ దేవుడనైన యెహోవానగు నేను పరిశుద్ధుడనై యున్నాను" (లేవీ. 19:2). ఆయన వారితో యింకా యిలా అన్నాడు, "మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని చెప్పుము" (నిర్గమ. 19:6). ఇశ్రాయేలును పరిశుద్ధతకు పిలువబడినదని మనస్సులో ఉంచుకొని, లేవీ. 19:2నుండి కోట్ చేసి, తన పత్రికయొక్క పాఠకులకు పేతురు యిలా తెలిపాడు, "–నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడియున్నది. ... గనుక మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై యుండుడి" (1 పేతురు 1:15, 16).

క్రైస్తవులు, దేవుని జాతీయ ప్రజలైయుండి, దేవుని పోలియుండాలి. ఆయన పరిశుద్ధుడు, గనుక ప్రియులైన పిల్లలవలె మన వ్యక్తిత్వంలోను, కార్యాల్లోను మన తండ్రిని పోలియుండాలి (ఎఫెసీ. 5:1, 2).

"పరిశుద్ధుడు" అనే పదానికి, "పవిత్రమైన ఉపయోగానికి ప్రత్యేకింపబడిన" అని అర్థం. క్రైస్తవులకు దీన్ని వర్తింపజేసినప్పుడు, విభాగింపబడని భక్తి మరియు పరిచర్య ఆయనకు జరిగించడానికి ప్రత్యేకింపబడిన దేవుని ప్రజలని భావం.

ఒక క్రైస్తవునికి రెండు దేశాల్లో పౌరత్వముంటుంది – ఒకటి అతడు జీవించేదానిలో మరియొకటి తాను దేనికి సమర్పించుకున్నాడో దానికి. ఈ లోకమందు భూమి యొక్క పౌరుడుగా అతడు జీవిస్తాడు, కాని అతన్ని ఏలే పౌరత్వం దేవుని లోకానికి, ఆత్మసంబంధ మైన దానికి, పరలోక సంబంధమైన రాజ్యానికి చెందింది. "మన పౌరస్థితి పరలోక మందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము" అని పౌలు వ్రాశాడు (ఫిలిప్పీ. 3:20).

దేవుని పరిశుద్ధ జనంలో లేక దేశంలో క్రైస్తవుడు ఎలా పౌరుడైయున్నాడో ఆలోచిస్తుండగా, అతడు వెంటనే ఆదరింపబడతాడు, సవాలు చేయబడతాడు – దేవునితో తనకున్న బాంధవ్యాన్నిబట్టి సవాలు చేయబడతాడు మరియు పరలోక సంబంధమైన

తన పిలుపులో గుప్తమైయున్న బాంధవ్యంచేత అతడు సవాలు చేయబడతాడు. భూమిమీద మన ప్రవర్తన, పరలోక సంబంధమైన పౌరత్వాన్ని ప్రతిఫలింపజేస్తూ ఉండాలని పేతురు అన్నాడు. పరిశుద్ధత అనేది క్రైస్తవ జీవితం యొక్క ప్రతి విషయానికి విస్తరించునదై యుండాలి. పేతురు తెలిపిందేమంటే, "... మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై యుండుడి" అని (1 పేతురు 1:15). మనం చెప్పేది, చేసేది, యోచించేది అంతా మనం ఎవరిమో అనే దాన్ని ప్రదర్శించాలి.

స్కూలుకు పంపేటప్పుడే గాని, కొద్దిసేపు ఆమెనుండి వేరుగా ఉండవలసిన ఏ పనికైనా పంపేటప్పుడే గాని, "మీరెవరో గుర్తుంచుకోండి" అని ఒక తల్లి తన బిడ్డలతో చెప్పుతూ ఉండేది. తామెవరో గుర్తుంచుకొంటే, దానికి తగినట్టు ప్రవర్తించడానికి వారికి బుద్ధి పుట్టుతుందని ఆమె నిరీక్షిస్తుంటుంది. తామెవరో క్రైస్తవులు జ్ఞాపకమందుంచు కున్నట్టయితే, పరిశుద్ధమైన జీవితాలు జీవించడానికి వారు బలవంతపెట్టబడతారు.

మనము "పరిశుద్ధమైన జనమై" ఉన్నందుకు ఆనందించుదాం.

## దేవుని సొత్తయిన ప్రజలు

నాల్గవది, క్రైస్తవులు "వింతైన ప్రజలని" పేతురు తెలిపాడు (1 పేతురు 2:9; KJV). NASBలో, "దేవుని సొత్తయిన ప్రజలు" అని ఉంది, గ్రీకు ప్రయోగాన్ని యిది స్పష్టంగా తర్జుమా చేస్తుంది. క్రైస్తవులు దేవుని ఆస్తి, ఆయన సొత్తు, మరియు, ఈ భావంలో, వారు వింతైన ప్రజలు అనేది పాయింట్.

శరీర సంబంధమైన ఇశ్రాయేలుతో దేవుడు మోషే ద్వారా యిలాగు సెలవిచ్చాడు. "నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనము, నీ దేవుడైన యెహోవా భూమిమీదనున్న సమస్త జనములకంటె నిన్ను ఎక్కువగా ఎంచి, నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచు కొనెను" (ద్వితీయో. 7:6). ఆలాగే ఆయన వారితో చెప్పిందేమంటే,

> మరియు యెహోవా నీతో చెప్పినట్లు నీవే తనకు స్వకీయ జనమైయుండి తన ఆజ్ఞలన్నిటిని గైకొందువనియు, తాను సృజించిన సమస్త జనులకంటె నీకు కీర్తి ఘనత పేరు కలుగునట్లు నిన్ను హెచ్చించుదునని ఆయన నీకు సెలవిచ్చినట్లు నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనమై యుందువనియు యెహోవా ఈ దినమున ప్రకటించెను (ద్వితీయో. 26:18, 19).

దేవునికి చెందిన ప్రజలు అనే ఈ రమ్యమైన భావన క్రీస్తు సంఘానికి పేతురుచే వర్తింపజేయబడింది; ఇప్పుడు క్రైస్తవ యుగంలో, సంఘమే దేవుని సొత్తయిన ప్రజలని అతడు తెలియజేశాడు. "ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్ క్రియలయందాసక్తిగల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను" అని తీతు 2:14లో అన్నప్పుడు ఈ పద ప్రయోగాన్నే వర్తింపజేశాడు.

కొన్ని సంవత్సరాల క్రిందట, వాషింగ్‌టన్ డి. సి. లో, సువార్త కూటాల్లో నా కుటుంబం నాతో కూడ ఉంది. ప్రఖ్యాతిగాంచిన ఆ పట్టణంలోని అనేక చారిత్రక స్థలాలకు

సహోదరులు ఆ వారంలో మమ్మును తోడుకొని పోయారు. నా జ్ఞాపకాల్లో స్పష్టంగానున్న ఒకటి ప్రియమైన ప్రసిడెంట్ అబ్రాహాం లింకన్ హత్య చేయబడిన స్థలాన్ని సందర్శించడం. ఆ మనిషియొక్క త్యాగాన్నిబట్టి, ఆ దృశ్యంవలన నేను బాగా ఇంప్రెస్ అయ్యాను. ఆ చోటుకు క్రింది భాగంలో మ్యూజియం ఉంది. ప్రఖ్యాతిగాంచిన ఆ మనిషికి సొంతమై లేక అతనిచేత ఉపయోగింపబడినందున అల్పమైన, విలువలేని వస్తువులకు బ్రహ్మాండమైన విలువ యివ్వబడింది. తాను చంపబడిన దినాన వేసుకొన్నందున ఆ షూ వాస్తవంగా ఎక్కువ ఖరీదు కలది కాకపోయినా, అద్దాల పెట్టెలో ఉంచి భద్రం చేయబడినదానికి వెల కట్టలేని విలువ వచ్చింది. అల్పమయిందే, దానికి ఎవడు సొంతగాడో దానినిబట్టి అమూల్యమైన ధనంగా భావించబడుతుంది.

మనలను మనలనుగానే తీసికొన్నప్పుడు, క్రైస్తవులమైన మనం ఎక్కువ విలువ లేనివారమే కావచ్చు, కాని దేవుని సొత్తయిన ప్రజలుగా మనం చూడబడినప్పుడు, మనం దేవుని సొంతమై ఆయనచే మనం ఉపయోగింపబడినప్పుడు, మన విలువ అధికమౌతుంది! భూ జనులందరిలో దేవుడు మనలను తన సొత్తుగా చేసికొన్నాడని మనం గుర్తించినప్పుడు మన విలువ, విలువ అనేదాన్ని గూర్చిన మన భావన మనకు ఎంతో మేలు చేస్తుంది.

ఒక ఆట వస్తువు కొనుక్కోడానికి ఒక పసివాడు ఆటవస్తువుల షాపులోనికి తన తల్లితో వెళ్లుతున్నట్టు చిత్రించుకో. అమ్మకానికి పెట్టబడిన ఆటవస్తువులను ఆ పసివాడు చూస్తూ ఉండగా, వాడి కన్ను విరిగిపోయిన పడవమీద పడింది. “ఉన్నపాటునే అమ్మకం” అనే కాగితం దానిమీద అంటించి ఉంది. “ఉన్నపాటున” ఆ పడవ విలువ చాలా తక్కువ, అయితే అతడు దానినే కోరుకున్నాడు. అల్పమైన వెల దానికి చెల్లించాడు. అతడు యింటికి వచ్చిన తోడనే దానితో పనిచేయనారంభించాడు. ఇక్కడ కొద్దిగా అక్కడ కొద్దిగా రిపేరు చేసి, మొత్తానికి పెయింట్ వేశాడు. “నేను నిన్ను కొన్నాను, నేను నిన్ను బాగు చేసికొన్నాను. ఇప్పుడు నీవు నిజంగా నా సొత్తు” అని ఆ పసివాడు ఆ పడవతో అంటున్నాడు! అలాగే, క్రైస్తవులు దేవునికి చెందినవారు. ఆయన మనలను తన కుమారునియొక్క రక్తంతో కొన్నాడు, మనం ఆయన వైపుకు తిరగడంలో ఆయన మనలను తిరిగి చేసికొన్నాడు. ఇప్పుడు, విమోచనా వైభవంతో, “వీరు నిజంగా నా జనులు” అని ఆయన చెప్పగలడు. క్రీస్తులోనికి మార్పుచెందిన వ్యక్తి దేవుని సొత్తు అనే అద్భుతమైన అంతస్థుకు లేపబడ్డాడు.

మనం “వింతైన జనులమైనందుకు” ఆనందించుదాం.

## ముగింపు

గనుక, సంఘము ఆత్మసంబంధమైన ఇశ్రాయేలు, నేడు దేవుని ఇశ్రాయేలైయున్నది. ప్రాచీన ఇశ్రాయేలు ఎలాగో అలాగే మనమును దేవునియొక్క ఏర్పరచబడిన జనమై యున్నాం. పాత నిబంధన కాలంలోని ఇశ్రాయేలుకున్నట్టు నేడు మనకు యాజకత్వముంది. ప్రాచీన కాలంలో ఇశ్రాయేలును దేవుని పరిశుద్ధ జనమైయున్నట్టుగానే నేడు సంఘము దేవుని పరిశుద్ధ జనమైయుంది. ఇశ్రాయేలును ప్రాచీన కాలంలో దేవుడు తన సొత్తయిన

ప్రజలైయున్నట్టు పిలిచినట్టుగానే, నేడు, క్రైస్తవ యుగంలో క్రీస్తు సంఘాన్ని తన సొత్తుగా గౌరవించాడు.

ప్రతి నవంబరు నాల్గవ వారం, అమెరికావారు కృతజ్ఞతలు చెల్లించే దినంగా ఆచరిస్తారు. క్రొత్త నిబంధనలో ఎక్కడా ఒక ప్రత్యేకమైన దినం కృతజ్ఞతలు చెల్లించే దినంగా ఆజ్ఞాపించబడలేదని, కృతజ్ఞతాస్తుతులు చెల్లించడం అనుదిన చర్య, కొనసాగించబడే స్వభావమైయుండాలని మనం గ్రహించుతాం. క్రొత్త నిబంధనలో కృతజ్ఞతలు చెల్లించడం నియమింపబడిన దినంలో కాదు, అది స్వభావ తత్వమైయుండాలి. "మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు ..." అని క్రైస్తవ లక్షణాన్ని పౌలు తెలియజేశాడు (ఎఫెసీ. 5:20). క్రైస్తవ ఆశీర్వాదములను గూర్చి మనం ఆలోచించినప్పుడు అనుదినము కృతజ్ఞతలు చెల్లించే దినంగా ఎందుకు ఉండాలో మనం సులభంగా చూడగలం. "ఏర్పరచబడిన వంశంగా," "రాజులైన యాజక సమూహంగా," "పరిశుద్ధ జనంగా," "దేవుని సొత్తయిన ప్రజలుగా" మనం నిజంగా దీవించబడినందున, అనుదినం "నీ దీవెనలన్నిటిని లెక్కించి, ఒక్కొక్క దానిని పేర్కొను" అంటూ మనం గానం చేయవలసియున్నాం.

నీవు క్రైస్తవుడవు కాకున్నట్టయితే, మానవులకు దేవుడు ప్రసాదించే అత్యున్నతమైన, ఘనమైన దీవెనలను నీవు పొందలేకపోతున్నావు. తన సంఘంపై దేవుడు కురిపించిన ఆధిక్యతలను నీవు యిప్పుడు చూచావు, దానిలో భాగంగా దేవుడు నిన్ను చేయడానికి సమ్మతిస్తావా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. "కాలము పరిపూర్ణమైనప్పుడు" అనే ప్రయోగానికి క్లుప్తమైన వివరణ యిమ్ము.
2. పాత నిబంధన కాలం లోకాన్ని క్రీస్తుయొక్క రాకకొరకు ఎలా సిద్ధం చేసింది?
3. దేవునియొక్క ఏర్పరచబడిన వంశంగా క్రైస్తవులు ఎలా సూచింపబడగలరు?
4. దేవునితో మనకున్న అంతస్థు దేవునియొక్క కనికరము మరియు మన విశ్వాస, విధేయతపై ఆధారపడియుంటుంది. యోగ్యతపై ఆధారపడే అంతస్థుతో దీన్ని పోల్చిచూడు.
5. పాత నిబంధన చట్టం క్రింద యాజకత్వం నిర్వహించిన పాత్ర ఏది?
6. పాత నిబంధన కాలంలో యాజకులెవరు?
7. "యాజక సమూహం"తో "రాజులైన" అనే పదం తెలియజేసే సమాచారమేమి?
8. ఏ భావంలో సంఘము "పరిశుద్ధజన"మయ్యింది?
9. రెండు దేశాల్లో క్రైస్తవుడు ఎలా పౌరుడయ్యాడో వర్ణించు.
10. "వింతైన జనం" అనే ప్రయోగాన్ని నిర్వచించు.
11. క్రైస్తవులు దేవుని ప్రత్యేకమైన జనమని ఆలోచించినప్పుడు నీ మనస్సుకు ఏ దీవెనలు గుర్తొస్తాయి?
12. నేడు ఆత్మసంబంధులైన ఇశ్రాయేలులో మనం ఎలా ప్రవేశిస్తాం?